క్లుప్తంగా

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం వాణి స్కూల్ విద్యార్థులు శనివారం ఏలూరు రోడ్డులో పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ అంజూరు శేషుబాబు మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను ఆదివారం వేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పోలియో చుక్కలు వేయించాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని రమణ కోకిల సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు సింగంపల్లి రమణ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ సంగీత విభావరి, గాయకుడు కె.డేవిడ్ రాజు, టి.శ్రీనివాసరెడ్డిలకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలో కళాకారులకు కొదువలేదని, మరుగున పడిన కళాకారులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అభినందించారు. సావిత్రి కళా పీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సత్కార గ్రహీత కె.డేవిడ్‌రాజు అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా వందలాది కార్యక్రమాలను నిర్వహించారన్నారు. కొప్పరపు బలరామకృష్ణ మూర్తి కళాకారులను అభినందిస్తూ ప్రసంగించారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. స్థానిక 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో శనివారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశానుసారం నగరపాలకసంస్థ అధికారులు ఈఈ ప్రభాకర్, శ్రీనివాసరావులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించారు. శ్రీనగర్ కాలనీలో నీరు నిల్వలేకుండా పైపులైన్ల ద్వారా తరలించాలని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం దోమల నివారణ చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ అధికారులకు సూచించారు. శ్రీనగర్ కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవటం వల్ల మురుగు నీరు నిలిచిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. దీనిపై సమస్యలను పరిశీలించిన అధికారులు దోమల నివారణకు మురుగునీరు తరలించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నగర పాలకసంస్థ అధికారులు, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి కూచిపూడి నృత్యనీరాజనం



విజయవాడకల్చరల్: కూచిపూడి గ్రామ అధిష్ఠాన దేవత బాలా త్రిపుర సుందరి రామలింగేశ్వరస్వామి 261 వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా కూచిపూడి గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథకళి లాంటి భారతీయ నృత్య సంప్రదాయ కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించాలని తెలిపారు. ముందుగా పేర్లు వారు ప్రదర్శించే అంశాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమలతో పాటు దేవాలయంలో నిత్యపూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో నాట్యాచార్యులు సప్పా శివకుమార్, విజయశేఖర్ పాల్గొన్నారు. 98491 38166 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేదల అభివృద్ధే లక్ష్యంగా పారదర్శక పాలన

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వంగవీటి మోహనరంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 27వ డివిజన్ గులాబీతోటలో శనివారం జగనన్న రావాలి... శ్రీనన్న కావాలి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గులాబీతోటలో రోడ్డు విస్తరణ చేయాలని, దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని పలువురు కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షల మేరకు గులాబీతోట రోడ్డు విస్తరిస్తామని ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. తొలుత రోళ్లపాలెంలోని మసీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అలాగే వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బోండాకు ఓటు అడిగే అర్హత లేదు..

27వ డివిజన్‌లో పేదలకు అమరావతిలో కేటాయించిన ఇళ్లను బోండా ఉమా, చంద్రబాబు నాయుడు కోర్టులో స్టే తెచ్చి అడ్డుకున్నారని అటువంటి బోండాకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. టీడీపీ నేతలు ప్యాలస్‌లలో ఉంటూ పేదలకు ఇచ్చిన ఇళ్లను దుర్మార్గంగా అడ్డుకోవటం విచారకరమని ఎమ్మెల్యేలు చెప్పారు. టీడీపీ నేతలు బోండా ఉమా ఎన్ని యుక్తులు, కుయుక్తులు పన్నినా పేదలకు అమరావతిలో ఇళ్లు ఇచ్చితీరుతామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని చూసి ఓటు వేయాలని కోరారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

మైనార్టీలను అవమానపరిచిన వ్యక్తి బోండా

బోండా ఉమాకు ఓటు రాజకీయాలు తప్ప ప్రజలపై అభిమానం లేదని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కనీసం మైనార్టీలకు గౌరవం ఇవ్వని బోండాకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బోండా ఉమా బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదని తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఎంతమంది కలిసి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేరని వెలంపల్లి అన్నారు. ప్రతీ పేదవాని మనస్సులలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్‌ను అభివృద్ధి చేశామన్నారు. డివిజన్‌లో రజకుల చిరకాల వాంఛగా ఉన్న రజకుల కల్యాణ మండపం నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చామని చెప్పారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 27వ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 32వ డివిజన్ రామలింగేశ్వరపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన క్రాస్ రోడ్లను కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.38.86 లక్షలతో రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్డు నుంచి బిస్మిల్లా చికెన్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన పేవర్ బ్లాక్స్ పనులకు భూమిపూజ నిర్వహించారు.

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీతో పోటీ పడే రాజకీయ పార్టీ దేశంలోనే మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వంలో డివిజన్‌లో ఎటు చూసినా సమస్యలే కనపడేవని.. ఈ ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా మారిందని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్‌లో రూ.12 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రధానంగా రహదారుల నిర్మాణంపై దృష్టి సారించి.. రూ.8.16 కోట్లతో 8.28 కి.మీ. మేర రోడ్లను నిర్మించామని చెప్పారు. చంద్రబాబు హయాంలో చెరువులను తలపించిన లోటస్ ప్రాంతాన్ని.. రూ.6 కోట్లతో మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దామన్నారు. రూ. 40 లక్షలతో ఆర్చ్ రోడ్డును, రూ.15.35 లక్షలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించామని చెప్పారు. రూ.17 లక్షలతో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు తుదిశకు చేరుకోగా.. వారం రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. అలాగే ఈ ప్రాంతవాసులకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో అల్లూరి సీతారామరాజు పార్కు ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోమారు నిండుమనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, ఏఈ నాగరాజు, కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్ రావు, నాయకులు గుండె సుందర్ పాల్, ఒగ్గు గవాస్కర్, ఎంఎస్ఆర్, పేరం త్రివేణి రెడ్డి, చింతా పెద్దిరాజు, శ్యామ్ నాయకులు, సచివాలయ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.



రామలింగేశ్వర పేటలో క్రాస్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

ఎలక్ట్రికల్ వాహనాలదే భవిష్యత్



గోపాలరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎలక్ట్రికల్ వాహనాలదే భవిష్యత్ అని ఈవీ సోల్యూషన్స్ సీఈఓ లక్కిరెడ్డి గోపాలరెడ్డి అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో ఎలక్ట్రికల్ వాహనాలు – భవిష్యత్ అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. గోపాలరెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలక్ట్రికల్ వాహనాలను ఉపయోగించడం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా మెయింటెనెన్స్ కూడా చాలా తక్కువ అవుతుందన్నారు. ప్రస్తుతం ఇతర దేశాల్లో ఎలక్ట్రానిక్స్ వాహనాల వినియోగం ఎక్కువగా ఉందని, మన దేశంలో ఇప్పుడిప్పుడే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరుగుతోందని చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనంలో ఉపయోగించే బ్యాటరీల తయారీ పరిశ్రమలో ఎక్కువగా ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమల స్థాపించాలనుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు ఉన్నాయని చెప్పారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి సాంబశివరావు మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వాహన రంగంలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు అవగాహన కోసం ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈవీ సోల్యూషన్స్ సంస్థతో తమ కళాశాల ఒప్పందం కూడా కుదుర్చుకుందని చెప్పారు. సదస్సు అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు అధ్యాపకులు కలిసి గోపాలరెడ్డిని సత్కరించారు.

నేడు ఎంఎస్ మూర్తి చిత్రకళ ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఎంఎస్ మూర్తి చిత్రకళా ప్రదర్శన, దృశ్య శ్రవణ చిత్రం ఏర్పాటు చేసినట్లు అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకళా ప్రదర్శనను ఉదయం 10 గంటలకు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చలానంద, శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం పరిపాలన అధికారి కె.ఎస్.రామారావు చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. ఎంఎస్ మూర్తి చిత్రకళా రంగానికి చేసిన నిస్వార్థ సేవలకు, విజయవాడ నగరంలో ఆర్ట్ గ్యాలరీ నిర్మాణానికి వారు చేసిన సేవలకు గుర్తింపుగా గతేడాది నవంబర్ నుంచి శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్రకళా ప్రదర్శనను చిత్రకారులు, కళాభిమానులు, ప్రజలు సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులను సత్కరిస్తామని తెలిపారు. అలాగే పలు కళాశాలల్లో నిర్వహించిన చిత్ర కళా పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):సుప్రసిద్ధ స్వయంభూ శ్రీ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులుహాల్‌టికెట్‌లను స్వామివారి వద్ద ఉంచి పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. వాహనచోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోరంకి మహాలక్ష్మినగర్ ప్రాంతానికి చెందిన డి.సుబ్బారావు వ్యవసాయ పనులు చేస్తాడు. అతను బైక్‌పై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా నిడమానూరు రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి గాయాలయ్యాయి. బాధితుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నున్నలో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. నున్న, సూరంపల్లి, కొండపావులూరులలోని లే అవుట్లను వీఎంసీ, గృహనిర్మాణ శాఖాధికారులతో కలిసి శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. నున్న లే అవుట్‌లో తొలి దశలో 4,041 ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా 1,500 ఇళ్లు పూర్తయినట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. సూరంపల్లిలో 3,942 ఇళ్లకు 839 గృహాలు పూర్తయ్యాయన్నారు. కొండపావులూరులో మొదటి దశలో 3,630 ఇళ్లకు 528 ఇళ్లు తుదిదశకు చేరుకోగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పూర్తయిన ఇళ్లను వారం రోజుల్లో లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మల్లాది విష్ణు సూచించారు. మౌలిక సదుపాయాలైన రోడ్లు, విద్యుద్దీకరణ పనులు కూడా సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియపర్చాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

నిండు మనసుతో ఆశీర్వదించాలి

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల సాకారం కోసం కాలనీల పేరుతో ఏకంగా మినీ సిటీలనే నిర్మిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా 31 లక్షల మంది పేద కుటుంబాలకు సొంతింటి స్థలం మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో విజయవాడ నగరంలో 28 వేల ఇళ్లను మంజూరు చేయగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకేసి లక్ష ఇళ్లను పేదలకు మంజూరు చేశారని చెప్పారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో ప్రతిపక్షం కోర్టులకు వెళ్లడంతో ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరిగిందని, లేకుంటే ఇప్పటికే గృహప్రవేశాలు మూడొంతులు జరిగి ఉండేదన్నారు. ఒక్క విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే 30 వేల మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు కేటాయించామన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.270 కోట్లను వెచ్చించిందని చెప్పారు. తెలుగుదేశం హయాంలో ఇంత పెద్దమొత్తంలో నిధులను కేటాయించలేదని గుర్తు చేశారు. తమ పాలనను, చంద్రబాబు చేతగాని పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గమనించి, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే వెంట ఈఈ(హౌసింగ్) కపూర్, డీఈ విజయ్‌బాబు, డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, ఏఈ(హౌసింగ్) ఇర్ఫాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న తరుణ్ కాకాని, వేదికపై ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలు పెంచుకోవాలని అమరావతి బోటింగ్ క్లబ్ సీఈఓ తరుణ్ కాకాని అన్నారు. నలంద డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ మీట్ స్పార్కిల్ 2కే 24 కార్యక్రమం శనివారం ఉత్సాహ పూరితమైన వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తరుణ్ కాకాని మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. పోటీల్లో గెలవడం ముఖ్యం కాదని, ప్రతి పోటీలో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవచ్చునన్నారు. విద్యార్థులు తమ కెరీర్‌ను అద్భుతంగా మలచుకోవాలని, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలంటే క్రియేటివిటీ, ఇన్నోవేటివ్ ఆలోచనలు ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో బిజినెస్ ఐడియాలు ఉంటే, వాటిని తమతో షేర్ చేసుకుంటే అలాంటి వారికి అవసరమైన ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు ప్రదర్శించేందుకు ఇదొక చక్కటి వేదిక అన్నారు. ఈ సందర్భంగా క్విజ్, పోస్టర్ మేకింగ్, హెచ్‌ఆర్ ఎనలిస్ట్, మార్కెట్ ఎనలిస్ట్, ఫైనాన్షియల్ ఎనలిస్ట్, ట్రెజర్ హంట్, డాన్స్, స్పాట్ ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అందరికీ అందుబాటులో ఓపెన్ డయాస్



ఓపెన్ డయాస్‌పై ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడకుండా ప్రజల ఆకాంక్షల మేరకు రూ.7.62 లక్షలతో ఓపెన్ డయాస్ నిర్మించి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గులాబీతోట ఏడీసీ పార్కులో రూ.7.62 లక్షలతో నిర్మించిన ఓపెన్ డయాస్‌ను శనివారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇక్కడ కాపుల కల్యాణ మండపం పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. దీంతో తాము అందరికీ అందుబాటులో ఉండేలా ఓపెన్ దయాస్‌ను నిర్మించామని తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాము సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కూచిపూడి నృత్యాలు



విజయశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య కార్యక్రమాలు మనోహరంగా సాగాయి. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ బృందం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాట్యాచార్యుల బృందాలు మాగలూరి త్రినాథాచారి, యడం సురేంద్రకుమార్, టి.వెంకట నిర్మల, చెన్నా తన్మయి, యల్లా జోస్యుల అనూరాధ, బి.అనితారావు, గోలి తేజశ్రీ బృందాలు సోలోగానూ, గ్రూప్ నృత్యాలను ప్రదర్శించారు. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను ప్రారంభించిన శివకుమార్ మాట్లాడుతూ.. సంప్రదాయ నృత్య సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు నాట్యదీపిక, బసవ నంది పురస్కారాలను ప్రదానం చేశారు.

పురస్కారాల అందజేత

కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత వేదాంతం రాధేశ్యాం మాట్లాడుతూ కూచిపూడి గ్రామం పేరుతో ఏర్పాటైన నాట్యం నేడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిందన్నారు. కూచిపూడి నాట్యానికి విశేషసేవలను అందించిన నాట్యాచార్యుడు కే విజయ శేఖర్‌కు నాట్య విజ్ఞాన్ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాత్ర సంగీత విద్వాంసురాలు శాంతి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి వీజీవీవీడీస్ కుమార్, తటవర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నాట్యాచార్యుడు ఘంటసాల పవన్‌కుమార్ నిర్వహించారు. చిన్నారులకు నాట్య దీపిక, బసవ నంది పురస్కారాలను ప్రదానం చేశారు.



● ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

జిల్లాలో ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





దైవానుగ్రహానికి ఆధ్యాత్మిక చింతన అవసరం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దైవానుగ్రహానికి ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం, శ్రీగంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వరస్వామివార్ల దేవస్థానం ఆలయాలకు అనుబంధంగా నూతనంగా నిర్మించిన శ్రీరామ భవన్‌ను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, ఎమ్మెల్సీ రుహుల్లాతో కలిసి వెలంపల్లి శనివారం ప్రారంభించారు. వారు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీరామ భవన్ ప్రారంభం..

అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో కృష్ణా పుష్కరాల పేరుతో అనేక దేవాలయాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తే సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వాటన్నింటిని పునఃనిర్మించామని తెలిపారు. ఆలయ ధర్మకర్త పితాని సాంబశివరావు, విజయ దంపతులు మాట్లాడుతూ ఆలయంలో జరిగే ప్రత్యేక శుభ కార్యక్రమాల్లో భాగంగా హోమాలు నిర్వహించేందుకు శ్రీరామ భవన్‌ను నిర్మించామని తెలిపారు. అలాగే పై అంతస్తులు భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, పి.చైతన్యరెడ్డి, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, నాయకులు షేక్ హయాత్ షరీఫ్, ఎస్కే నజీర్, అండిమాని బాబ్జి, సూర్య, రేలంగి బుజ్జి, అండిమాని ఈశ్వర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో వేం చేసి ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో మహాశివరాత్రికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రావూరి వెంకటేశ్వరరావు, పాలక మండలి చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, సభ్యులు శనివారం తెలిపారు. ఆలయంలో ఏర్పాట్లను సమీక్షించారు.